ఏడాదిన్నర పాపను బుజ్జగిస్తూ అన్నం తినిపిస్తోంది మాధురి. కిటికీ దగ్గర నిల్చోబెట్టి బయటికి చూపిస్తూ గోరు ముద్దలు నోట్లో పెడుతూంది. పాప మారాం చేస్తూంటే దూరం నుంచి వస్తున్న సైకిల్‌ను చూపిస్తూ... ''అదిగో... బూచాడొస్తున్నాడు. తొందరగాతినమ్మా!. పట్టుకుపోతాడుతెల్సా?'' అంటూ తినిపిస్తోంది. పాప బెదర లేదు. అలా వస్తూన్న సైకిల్‌ని ఓసారి తీక్షణంగా చూసింది మాధురి.

అదే డొక్కు సైకిలు...

అదే వ్యక్తి...

అదే ఖాకీ డ్రెస్సు...

అదే జబ్బ సంచి...

అతను... తనింటి వైపే వస్తున్నాడు. మాధురి గుండెల్లో గుబులు పేరుకుంది.

గుండె దడ పెరిగింది. గోరు ముద్దలు కలపటం మర్చిపోయి... నిశ్చేష్టురాలైంది. అతను ఖచ్చితంగా మాధురి ఇంటి వైపే వస్తున్నాడు. పాపను కిటికీ లోంచి దించి ముందు గదిలోకి వచ్చింది. కాని ముందు గదిలో వేసిన తలుపులు తీయడానికే కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. కుర్చీలో కూలబడి ఆ పాటికే మౌనంగా రోదిస్తూంది.

బయట సైకిల్ బెల్ రెండుసార్లువిన్పించి... ఆ తర్వాత ''పోస్ట్''అన్న కేక విన్పించింది. అయినా ఆమె లేవలేదు. అతను తెచ్చే కవరు తనకు తెలుసు. అందులో ఏముంటుందో కూడా తెలుసు. అందుకే అతనన్నా... అతడు తెచ్చే వార్తన్నా మాధురికి భయం... బయట పోస్ట్‌మాన్ మరో రెండుసార్లు అరిచాడు. తర్వాత తలుపు సందునుండి ఒక పచ్చటి కవరు నిశ్శబ్దంగా ముందు గదిలో పడింది.

మోకాలు మీద తల ఆనించి మూగగా ఏడుస్తోంది. పాప కూడా తప్పటడుగు లేస్తూ ముందు గదిలోకి వచ్చింది. మాధురికి గతం గుర్తుకొస్తుంది. ఆనాటి తీపి కలలు ఈనాడు ఆమె పాలిట మృత్యువులా తయారయ్యాయి. పాప కవరు తీసుకొచ్చి 'మమ్మీ' అంటూ ఇచ్చింది. కవరందుకుంది భయం...భయంగా! తన అడ్రసుతో అదే రైటింగు. ధైర్యం కూడదెచ్చుకుంటూ కవర్ చించింది.

''గౌరవనీయులైన శ్రీమతి మాధురి గారికి...

ఇంతకుముందు మా కుటుంబ దీనగాథ మీకు రాశాను. మరోసారి మీకు గుర్తుచేస్తున్నాను.మీకు పెళ్ళికాక ముందు మా అన్నయ్యని ప్రేమించారు. మీ అవసరాలకు తిప్పుకున్నారు. చివరికి ఎలాగైతేనేం ఓ ధనవంతున్ని పెళ్ళి చేసుకున్నారు. మీ పెళ్ళయ్యాక మా కుటుంబాన్ని పోషించే ఒక్కగానొక్క మా అన్నయ్య పిచ్చివాడయ్యాడు. ఉద్యోగానికి రాజీనామా చేసి తాగుబోతయ్యాడు. చివరికి మిమ్మల్నే కలవరిస్తూ.. మమ్మల్ని విడిచి పోయాడు.


అన్నయ్య చనిపోయి అయిదు నెలలు కావస్తున్నా మంచం పట్టిన మా అమ్మ మూసిన కన్ను తెరవటం లేదు. ఈ పరిస్థితుల్లో డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసిన నాకు ఉద్యోగం లేక ఎవరినీ పోషించలేక పోతున్నాను. ఈ పరిస్థితి గ్రహించిన ''అక్క'' తన దారి తాను చూసుకుంది. మా వటవృక్షం కూలిపోయినందుకు నేడో రేపో మా కుటుంబం బజారు పడనుంది.

ఇంత జరిగినా మా అందరికీ ఒక్కటే తెల్సు. మీ వల్లనే ఇదంతా జరిగింది. అన్నయ్య పోవటంతో మా కుటుంబం చిన్నాభిన్నమైంది. అందుకే మీరంటె నాకు కసి...ద్వేషం... పగ! అదే మీ మీద తీర్చుకుంటున్నాను. నాకో ఉద్యోగం ఇవ్వడానికి పద్దెనిమిది వేలు అడిగారు. ఇది బ్లాక్‌మెయిల్ అనుకోండి. మరేదేనా అనుకోండి. అర్జంటుగా డబ్బు పంపకపోతే అన్నయ్యకు ''మీరు రాసిన ఉత్తరాలు... మీ ఫోటోలు'' మీవారిగకి పంపించి మీ జీవితాన్ని నరకప్రాయం చేయాల్సి వస్తుంది.

మేం అనుభవించిన నరకం... మానసిక వేదన మీరు కూడా చవి చూడాలి.మీ పరువూ బజార్నపడాలి. డబ్బ పంపనట్లయితే వచ్చే ఉత్తరం మీ వారికే అందుతుంది. ఆలోచించుకోండి... రాజేష్.

ఉత్తరం చదివి మాధురి భయంతో కుంచించుకుపోయింది. భయంగా పాపను ఒడిలోకి తీసుకొని బావురుమంది. ఏడ్చి...ఏడ్చి వెక్కిళ్ళు ఆగిపోయినా కన్నీళ్ళు ధారాపాతంగా కారుతూనే వున్నాయి.

ఏ కల్మషం అంటని పాప తల్లిని అయోమయంగా చూస్తూండి పోయింది. ఆలోచనలో పడ్డ మాధురికి తలుపు చప్పుడువటంతో మరింత దుఃఖం పొంగిపొర్లింది. గబగబా



ఉత్తరాన్ని చించేసి కిటికీ. గుండా వదిలేసింది. మరోసారి తలుపుచప్పుడు... కళ్ళు కడుక్కొని మెల్లిగా తలుపు తీసింది.

ఎదురుగా చిరునవ్వుతో శ్రీకాంత్!!

ఆమె భర్త !!

తత్తరపాటుని అణిచిపెట్టుకొని నవ్వడానికే ప్రయత్నించింది. శ్రీకాంత్ మాధురిని విష్ చేసి లోపలికెళ్ళి పాపను ముద్దాడటంలో మునిగిపోయాడు. అరగంట తర్వాత మాధురి మామూలు స్థితికి వచ్చింది. భర్త ముఖంలోకి చూడలేక మౌనంగా వుంటోంది.

ఆమె మౌనం శ్రీకాంత్‌కు అర్థంగాదు.

ఆమె డబ్బు గురించి ఆలోచిస్తోంది. ఒక కొలిక్కిరాని ఆలోచనలు! గుండెను తొలిచేస్తూ ఆమెలోని ఆక్టివ్‌నెస్‌ని తినేసాయి.

భయం... నీరసం మాధురి బ్రతుకుని దుర్భరం చేసాయి. శ్రీకాంత్ పేర లెటర్ వస్తే... అన్న ఊహ ఆమె ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీసింది. సైకిల్ బెల్ విన్పించినా, పోస్ట్‌మాన్ కన్పించినా బిగుసుకుపోయేది.

వారంరోజులు గడచాయి. ఓ మంగళవారం రోజు ఆఫీసుకి సెలవుండి శ్రీకాంత్ ముందు గదిలోకూచొని మ్యాగజైన్ తిరగేస్తున్నాడు.

"పోస్ట్... శ్రీకాంత్‌గారు" అన్న కేక విన్పించింది. వంటగదిలో ఏవో సర్దుతున్న మాధురి గుండెల్లో బాంబులు పేలాయి. చితికిపోతున్న బతుకు కూలిపోయే మృత్యుశాసనాన్ని అతడు అందించాడనుకుంది. ఒక్క ఉదుటున ముందుగదిలోకి వచ్చింది. అప్పటికే శ్రీకాంత్ కవరందుకుని చించుతున్నాడు. మాధురి ఆకస్మికంగా లాక్కొంది. క్షణాల్లో ఆమె చేతిలో ఉత్తరం ముక్కలు ముక్కలయ్యింది. శ్రీకాంత్ నివ్వెరపోయాడు.

ఉన్మాదిలా "ఈ ఉత్తరం మీరు చదువొద్దు... మీరు చదువొద్దు..." అంటూ టేబిల్‌పై తల ఆనించి రోదించసాగింది. ఉత్తరం ముక్కలు గాలికెక్కడెక్కడో ఎగిరిపోయాయి.

శ్రీకాంత్ విభ్రాంతి లోంచి తేరుకోలేదు. నోటమాట రాక అలాగే నిల్చుండిపోయాడు. అతడు ఏ సమస్యనయినా తేలిగ్గా తీసుకొంటాడు. నూటికో, కోటికో ఒక్కరిలో వుండే ఆ గొప్పతనం శ్రీకాంత్‌లో వుంది. మాధురిలో కన్పిస్తున్న మార్పుని గమనిస్తూనే వున్నా, అడిగినా ఏ కారణం అడగొద్దని... రోదిస్తున్న భార్య భుజం మీద చెయి వేసి ఆప్యాయంగా నొక్కాడు.

"ఎందుకు మాధురి...ఏవిటీపని! ఎందుకు ఆ కన్నీళ్ళు? అని మాత్రం అడిగాడు. ఆ మాటకు దుఃఖం కట్టలు తెంచుకొని శ్రీకాంత్ భుజంమీద వాలిపోయి ఏడ్చింది. ఆమెను గుండెలకు హత్తుకొని మెల్లగా బెడ్‌రూంలోకి తీసుకొచ్చి పడుకోబెట్టాడు.

ఆమె అలాగే రోదిస్తూంది. ఏడుపందుకొన్న పాపనెత్తుకొని శ్రీకాంత్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇది జరిగిన మూడురోజుల...

మాధురికోసం వాళ్ళ బాబాయ్ వచ్చాడు. ఆయన ముఖంలో విషాదం తొంగిచూస్తోంది. మాధురి, శ్రీకాంత్ ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు.

"రండి బాబాయ్... ఇప్పుడే వస్తున్నారా? లోపలికి రండి" అంది మాధురి.

"ఇంటిదగ్గర అందరూ బావున్నారా మామయ్యా?" అడిగాడు శ్రీకాంత్. బాబాయ్ నోటినుండి బరువైన నిట్టూర్పు.

"అమ్మా... మాధురీ నీకోసం మీ తాతయ్య చాలా కలవరించాడమ్మా మీ అమ్మా నాన్న పోయింతర్వాత ఆయన నీకోసమే బ్రతుకుతూ నిన్ను ప్రాణప్రదంగా పెంచాడు. ప్చ్... చివరి చూపుకు కూడా నువ్వు రాలేదేమిటమ్మా" అన్నాడాయన కూచుంటూ.

"ఏమిటి బాబాయ్ మీరంటున్నది?" మాధురి మాట ముగించక ముందే ఆయనన్నాడు.

"ఆయన కన్నుమూసి వారంరోజులు దాటింది. ఆయన చనిపోయిన వెంటనే ఆ పల్లెటూర్లో టెలిగ్రాం వసతుల్లేక లెటర్ రాసాను కదమ్మా! అది అందుకొనైనా నువ్వొస్తాచూసాం. నువ్వు రాకపోయేసరికి కంగారుపడ్తూ నేనే వచ్చానమ్మా అన్నాడాయన కళ్ళనీళ్ళు తెచ్చుకుంటూ... శ్రీకాంత్‌కు ఏం మాట్లాడాలో అర్థంకావట్లేదు.


గుండె పగిలి... కన్నీటి కెరటాలు మెదడుని ముంచెత్తే సొమ్మసిల్లిన మాధురి అచేతనంగా గోడకు జారగిలబడింది.


## 2

మాధురి కళ్లు తెరిచే సరికి ఆస్పత్రిలో వుంది. తన తాతయ్య చావు కబురు తానే చేతులారా చింపేసుకుంది.

తన ఈ బ్రతుక్కి నిష్కృతి లేదు...

కాటేసిన ప్రేమ కన్నవాళ్ళని... కట్టుకున్న వాడిని దూరం చేస్తోంది.





## ఓ అన్న కొత్త సంవత్సరపు కన్నీరు!

బ్రదర్
కన్నీరుకే నీరొస్తోంది
ఇద్దరు రాజకీయ రౌడీలు ముందు వెనక
చంపుకుంటే...
ఇద్దరి మాన ప్రాణాలు బలి కావాలా?
ఇద్దరు అనాథలవ్వాలా?
ఇన్ని వందలకోట్ల ప్రజాధనం
బుగ్గికావాలా?
ఇదేం స్వాతంత్ర్యం?
ఇదెక్కడి ధర్మాసూక్ష్మం?
అమ్మ! ఒక్కమాటడుగుతా... నిజం
చెప్పు
[illegible]లాంటి జాతికి స్వాతంత్ర్యం
[illegible]రమా?
[illegible] 'బాపూజీ' కలల పంట ఇదేనా?
కొత్త సంవత్సరాలు వస్తున్నాయి...
రాబందుల రెక్కల చప్పుడు...
దగ్గరగా వినిపిస్తున్నాయి...
దేవుడా! నువ్వు ఉంటే...
ఈ పుణ్యభూమినోసారి చూడు.

— చావా శివకోటి

ఆనాడు అమృతమనుకున్నది ఇప్పుడు విష ప్రయోగమై ఒక కుటుంబాన్నే విధ్వంసం చేస్తోంది. ఆమె కళ్ళవెంట జలపాతంలా నీరు కారుతూనే వుంది.

డాక్టర్ పరీక్ష చేసాక మాధురికి పెద్దషాక్ తగిలిందని... ముఖ్యంగా స్థలమార్పిడి అవసరమని చెప్పి మెడిసిన్స్ రాసిచ్చాడు. మాధురి బెడ్ దగ్గర పాపను ఆడిస్తూ మాధురిని ఓదారుస్తూ వాళ్ళ బాబాయ్ రెండురోజులు గడిపాడు.

ఆ రెండు రోజులు శ్రీకాంత్ బెడ్ దగ్గరికి కాదుకదా కనీసం హాస్పిటల్‌కైనా రాలేదు. దీంతో మాధురికి మరింత భయం పట్టుకుంది.

భర్త తనకు దూరమవుతున్నాడేమో నన్నబాధ... ఈ రెండు రోజుల్లో ఆయనకు ఏ ఉత్తరం అందిందో నన్న భయం కలగలసి దుఃఖంగా మారుతున్నాయి.

నిస్సహాయ స్థితిలో మనసు చిక్కబట్టుకొని భర్త కోసం చూసింది. మూడో రోజున శ్రీకాంత్ వచ్చాడు. పూర్తి అలసటతో ముఖం చెప్తోంది. అతడి ఖిన్నవదనాన్ని చూడగానే మాధురి కళ్ళు చెమర్చాయి.మరో సమయంలో అయితే ముద్దుల్లో ముంచెత్తి అలసత్వాన్ని క్షణాల్లో పోగొట్టేది. ఆమె కళ్ళలోని నీళ్ళు చూసి శ్రీకాంత్ ఆప్యాయంగా తల నిమిరాడు.

"మాధురీ. డాక్టర్ గారు ఏంభయం లేదన్నారు. స్థల మార్పిడి అవసరమన్నారు. అందుకే మాధురీ... ఈ రెండు రోజులూ తిరిగి మనకు బెంగుళూరు టాన్స్‌ఫర్ చేయించాను.

రెండు మూడురోజుల్లో మనం బెంగుళూరు వెళుతున్నాం. నీ కిష్టమేనా మాధురీ" అనడిగాడు శ్రీకాంత్ ప్రేమగా.

మాధురిలో ఆర్తిగా నిండిన కన్నీళ్ళు...

"ఏమండీ... ఈరోజే... మళ్ళీ ఇటు రాకుండా... దూరంగా...బెంగుళూర్‌కే వెళ్దామండి...మనం ఇక్కడ్నుంచి పారిపోవాలి... మనం పారిపోదామండి" తన్ను కొస్తున్న కన్నీరు శ్రీకాంత్ ఒడిని తడిపేస్తుంటే. ఒళ్ళో తలదాచుకొని ఏడుస్తోంది మాధురి.

"తప్ప కుండా రేపే వెళదాం..." అంటూ గుండెల్లో ఆమెను దాచుకున్నాడు శ్రీకాంత్.

### 3

రైలు వేగాన్నందుకుంది. బయట కటిక చీకటి.

రెండవ బెర్తుమీద తేలికపడ్డ గుండెతో నిద్రపోతున్న మాధురి... ప్రక్కలో అంతకంటే ప్రశాంతమైన నిద్రలో పాప...

శ్రీకాంత్ కిటికీలోంచి చూస్తూ అనుకున్నాడు.

"మాధురీ... ఈ ధరిత్రి మీద జరిగిన నాటి ప్రేమ కథలన్నీ చరిత్రలో ఉన్నత శిఖరాలై నిలిచిపోవచ్చు.కాని నేటి ప్రేమకథలు చరిత్రలోకి విసిరేయబడ్డ గులక రాళ్ళుగానే వుండిపోతున్నాయి. కారణం...

ఈ ప్రేమల్లో అమరం లేదు... సమరంలేదు... వాడుకోవటాలు... బ్లాక్ మెయిలింగులు తప్ప...

అందుకే ... నువ్వు చెప్పకపోయినా నీ గతం నాకు తెలుసు మాధురీ. ఎదుటివారి స్థితిని అర్థం చేసుకునే వ్యక్తిత్వం నాకుంది... అందుకే నీకు ఉత్తరాలు రాసిన 'రాజేష్'కి ఉద్యోగం కల్పించి వస్తున్నాను... నీ గతాన్ని తప్పి నిన్ను దూరం చేసుకుని నన్ను నేను, నా పాపను అనాథలుగా చేయదల్చుకోలేదు."

శ్రీకాంత్ ఔన్నత్యానికి జైకొడుతున్నట్టు రైలు కూతేస్తూ సాగిపోతోంది.

★